
ప్రజాశక్తి
ఆదివారం 16 మార్చి, 2025
5
శ్రీకాకుళం



పాలనలో రెవెన్యూ శాఖ కీలకం

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ పాలనా వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలిలో గల రెవెన్యూ అతిథిగృహం ఆవరణలో డాక్టర్ శశిధర్ హాస్పిటల్, రెవెన్యూ సర్వీసుల సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆధునీకరించిన రెవెన్యూ అతిథి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అంకితభావంతో పనిచేయడం వల్ల భూ సమస్యల్లేని జిల్లాగా తయారు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ అసోసియేషన్ ఎన్నో ఏళ్లుగా పలు సామాజిక ... రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రాజు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీరాములు, బి.వి.ఎస్.ఎన్ రాజు, పి.శ్రీనివాసరావు, ప్రవల్లిక, కలెక్టరేట్ ఎఒ జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపు
- ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తాం : అచ్చెన్నాయుడు



చీపురుతో రోడ్డును శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - పలాస

పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని జీడిపిక్క బొమ్మ సెంటర్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. పలాసను జిల్లా కేంద్రం స్థాయిలో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ.120 కోట్లతో పూండి నుంచి డోల రోడ్డు, పలాసలో కేంద్రీయ విద్యాలయం, విమానాశ్రయం, రూ.48 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. పట్టణం గానీ, పల్లె గానీ పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, పలాస-కాశీబుగ్గ మంచినీటి కష్టాలు తీర్చేందుకు ఆఫ్‌షోర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.90 కోట్లు కేటాయించామని చెప్పారు. జిల్లా ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, ప్రతి ఇల్లు, ప్రతి వీధి శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని చెప్పారు. బయటకు వచ్చే సమయంలో ప్రతీ వ్యక్తి గుడ్డ సంచిను పెట్టుకొని వస్తే ప్లాస్టిక్‌ను నివారించవచ్చన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం స్టాళ్లను సందర్శించారు. మహిళలకు జ్యూట్ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు.

డయాలసిస్, ఎక్స్‌రే యూనిట్లు ప్రారంభం

స్థానిక కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎనిమిది డయాలసిస్ యూనిట్లు, ఒక ఎక్స్‌రే యూనిట్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులు రూ.67.50 లక్షల విలువైన ఎనిమిది డయాలసిస్ యూనిట్లు, ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఉత్తర అమెరికా, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ఆర్థిక సహకారంతో రూ.15 లక్షల విలువైన మరో రెండు డయాలసిస్ యూనిట్లు, నూతన ఎక్స్‌రే యూనిట్‌తో మరింత మెరుగైన వైద్యసేవలు లభిస్తాయన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోనే కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఇన్‌ఛార్జి డిఎల్‌డిఒ ఎన్.రమేష్ నాయుడు, ఎంపిడిఒ వసంత కుమార్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



భాస్కరరావు, మీనాక్షి మృతదేహాలు



శంకరరావు మృతదేహం

రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది. కారు టైరు పేలి ముందుగా ద్విచక్ర వాహనదారున్ని ఢీకొన్న అనంతరం ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడితో పాటు కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారకమైన ఈ సంఘటన బుడుమూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం చోటు చేసుకుంది.

రెప్పపాటులో ఘోరం

- టైరు పేలి బైక్‌ను, లారీని ఢీకొన్న కారు
- ఆపై బోల్తా పడిన వైనం
- ప్రమాదంలో నలుగురు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- పుట్టినరోజు వేడుకలకు వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పాతపట్నం మండలం పెద్దలోగిడికి చెందిన దువ్వారి కాళిదాసు తన కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో పుట్టినరోజు వేడుకలకు కారులో బయలుదేరి వెళ్తున్నారు. అతని కుమారుడు దువ్వారి లక్ష్మీపతి (28) కారు డ్రైవింగ్ చేస్తున్నారు. బుడుమూరు సమీపంలో వచ్చే సమయానికి తనకంటే ముందు దిచక్ర వాహనంతో విజయనగరం జిల్లా సంతకవిటి మండలం ముద్దుసంగ్రామ్‌నకు చెందిన తోలాపి శంకరరావు శ్రీకాకుళంలోని వైద్య పరీక్షలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వెనుక నుంచి వస్తున్న కారు టైరు పేలి ముందు వెళ్తున్న శంకరరావు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరరావు (35) రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. అదేవేగంతో వెళ్లి విశాఖపట్నం వైపు వెళ్తున్న సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని కారు ఢీకొని బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న దువ్వారి కాళిదాసు భార్య దువ్వారి మీనాక్షి మినమ్మ (60) కుమారుడు లక్ష్మీపతి (28) కారులోనే మృతి చెందారు. వీరి అల్లుడు ఉగ్గిరిపల్లి భాస్కరరావు (40) తీవ్రంగా గాయపడటంతో 108లో ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలో సెకన్ల వ్యవధిలోనే పరిస్థితి విషమించి మృతి చెందారు. కాళిదాసు మనుమరాలు కుసుమశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఒకే కుటుంబంలో ముగ్గురు, బైక్‌దారుడు మృతి చెందడంతో ప్రమాద స్థలంలో రక్తసిక్తమైంది. ప్రమాదం సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం, లావేరు ఎస్ఐ గదుల లక్ష్మణరావు ఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు ఘటనాస్థలం వద్ద శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, 2011లో అదే సమీపంలో కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి ఆరుగురు మృత్యువాత పడ్డారు.

నేడు, రేపు ఎపిపిఎస్‌సి పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 16, 17 తేదీల్లో ఎపిపిఎస్‌సి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని డిఆర్‌ఒ ఛాంబరులో ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్టు రేంజ్ అధికారి పరీక్షకు 546 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లకు 152 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మాత్రమే (గ్రేస్ పీరియడ్‌తో కలిపి) పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని స్పష్టం చేశారు. పరీక్షలో మైనస్ మార్కులు ఉంటాయని, అభ్యర్థులు సరిగా చూసుకోవాలని చెప్పారు. ఫారెస్టు రేంజ్ అధికారుల పరీక్ష ఒక పూట మాత్రమే ఉంటుందన్నారు. ఎన్టీఆర్ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్లకు ఒక్క కోర్ కళాశాలలో మాత్రమే పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు ఉంటుందని, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు మాత్రమే (గ్రేస్ పీరియడ్ తో కలిపి) పరీక్షా కేంద్రంలో అనుమతిస్తారని వివరించారు. పిహెచ్ అభ్యర్థులు ఉంటే వారికి స్క్రైబ్‌ను అనుమతించాలని, మొబైల్ అనుమతించరాదని, ఇన్విజిలేటర్ల వద్ద కూడా మొబైల్ ఉండరాదని చెప్పారు. శ్రీ వెంకటేశ్వర కళాశాల, శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, కోర్ కళాశాలలో ఎఫ్ఆర్ఒ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికపై అత్యాచారం

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, గుజరాతీపేట

శ్రీకాకుళం నగరం పరాంకుశనగర్‌లో గిరిజన బాలిక (17)పై నరసన్నపేటకు చెందిన టి.రమేష్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. డిఎస్‌పి సిహెచ్.వివేకానంద వెల్లడించిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం గాంద్ర గ్రామానికి చెందిన మైనర్ బాలిక శ్రీకాకుళం నగరంలో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమెకు వదిన వరసయ్యే లావణ్యతో కలిసి గదిలో ఉంటుంది. లావణ్య స్నేహితుడు కూడా అదే గదిలో ఉంటూ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. లావణ్య లేని సమయంలో చాలా కాలంగా ఆమెను లైంగికంగా వేధిస్తూ శారీరకంగా లొంగదీసుకున్నాడు. భయంతో బయటకు చెప్పలేక బాలిక తనలో తాను కుంగిపోయింది. వేధింపులకు చివరకు విసిగి వేశారిన ఆమె ఈనెల పదో తేదీన రూమ్ విడిచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు బొబ్బిలిలోని ఆమె స్నేహితురాలి వద్ద ఉందన్న విషయం తెలుసుకుని ఆమెను పోలీసులు శ్రీకాకుళం తీసుకొచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. నిందితుడు రమేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేశారు. అత్యాచారం జరిగిందని ప్రాథమిక విచారణలో గుర్తించి రమేష్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- గిరిజన గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

సరుబుజ్జిలి, బూర్జ: జిల్లాలో షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటిడిఎని ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్షకు పైగా గిరిజనులు ఉన్నారని, షెడ్యూల్ ఏరియాతో కూడిన ఐటిడిఎ లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్రలో గిరిజన సంఘ నాయకులు ఎస్.కృష్ణారావు, లక్ష్మణరావు, సింహాచలం, సురేష్, రాజారావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

నిధులు తక్కువ... పనులు ఎక్కువ

అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ శాఖలో నిధులు తక్కువ, పనులు ఎక్కువ అన్నట్లు ప్రస్తుత పరిస్థితి తయారైందని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి అవసరాలను తీరుస్తున్న రెవెన్యూ ఉద్యోగులు పని ఒత్తిడితో సతమతమవుతున్నారని తెలిపారు. గ్రీవెన్స్‌లో 80 శాతం సమస్యలు రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయని మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్నారని తెలిపారు. మూడు విభాగాల్లో ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రతి పనినీ ఆన్‌లైన్ విధానంలో చేపడుతున్న తరుణంలో రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బందికి సాంకేతిక శిక్షణ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిని పూర్తి చేసేందుకు సమయం ఇవ్వకపోవడం వల్ల తప్పులు దొర్లి అధికారుల ఆగ్రహానికి గురవుతున్నారన్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లో వాహనాల నిర్వహణకు రూ.10 వేల నుంచి 15 వేలు ఇస్తున్నారని తెలిపారు. రెవెన్యూ శాఖలో దాదాపు 49 వేల కేసుల్లో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని తెలిపారు. ఆ కేసుల్లో కోర్టులకు అయ్యే ఖర్చులను ఆయా ఉద్యోగులే భరించాల్సి వస్తోందన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయమని ఆదేశాలు జారీ చేశారని, కానీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. విఆర్‌ఎలు ఎన్నో ఏళ్లుగా రూ.పది వేల వేతనానికి వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. వారికి వేతనాలు పెంచాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాజు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

- ప్రైవేటు ఏజెన్సీల వల్ల పాత సమస్యలు పునరావృతం
- కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్: ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఆర్.చిన్నారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యాన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ, స్థానిక సంస్థల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, యూనివర్సిటీలు, విద్యుత్, ప్రభుత్వ సొసైటీలు, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, ఉపాధి హామీ, వెలుగు, 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆయుష్, ఆరోగ్యమిత్ర, ఏపిశాక్స్, అర్బన్ హెల్త్, ఎన్‌టిఇపి, ఎన్ఎంహెచ్‌పి తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. 2008 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలైందని, గత ప్రభుత్వం ఆ పద్ధతికి తిలోదకాలు ఇచ్చి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్కువ వేతనాలతో జిఒ నంబరు 7ను అమలు చేసిందని గుర్తుచేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక న్యాయం జరుగుతుందని ఆశించినా, సమస్యను పరిష్కరించకుండా జిఒ 2ను విడుదల చేయడం అన్యాయమన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన 4459, 4271, 3 జిఒల ప్రకారం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు గతంలో కాంట్రాక్టర్ల ద్వారా పనిచేశారని, కాంట్రాక్టర్లు సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడం, రెన్యువల్ సమయంలో డబ్బులు డిమాండ్ చేయడం, పిఎఫ్, ఇఎస్ఐలు సక్రమంగా జమ చేయక ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. ఆప్కాస్ ఏర్పాటుతో సమస్యలు లేకుండా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అందువల్ల ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రతి ఆరు నెలలకు కరువుభత్యం చెల్లించాలని, సిక్ లీవ్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ కారుణ్య నియామకాలు ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆప్కాస్‌లోని పలు విభాగాల నాయకులు ఎన్.శ్రీనివాసరావు, ధన్వంతరి, ప్రసాద్, జి.ఆదినారాయణ, కె.తేజ, జ్యోతి కుమారి, మౌనిక, ప్రత్యూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఎంపీ సీట్ల కోసం పిల్లలను కనాలా బాబూ...

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఆడబిడ్డకు రూ.50 వేలు, మగ పిల్లాడికి ఆవు దూడ ఇస్తామంటూ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మూడో సంతానం కనే దంపతులకు ఇటీవల ప్రోత్సాహకం ప్రకటించారు. జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహిస్తున్నాయని, ఆ నేపథ్యంలోనే తన నియోజకవర్గం పరిధిలో మూడో సంతానాన్ని కనే వారిని ప్రోత్సాహించేచాలని నిర్ణయించుకున్నట్లు చెప్పుకొచ్చారు. జనాభా పెంపుపై కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం పక్కన పెడితే రాష్ట్ర ప్రభుత్వంలో మాత్రం ఆ ఉత్సాహం కొంచెం ఎక్కువగానే కనిపిస్తోంది. ముఖ్యంగా చంద్రబాబు దృష్టంతా జనాభా పెంపుపైనే ఉంది. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్వవస్థీకరణ (డీలిమిటేషన్) జరిగే అవకాశం ఉండటంతో ఇటీవల అసెంబ్లీలో సైతం ఇదే అంశంపై ప్రసంగించిన చంద్రబాబులో ఆ తపన కనిపిస్తోంది. జనాభా ప్రాతిపాదికన సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పిల్లలను కనాలని పిలుపు నిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ శ్రీకాకుళం నగరానికి ప్రచారానికి వచ్చిన చంద్రబాబు నోట ఇవే మాటలు వినిపించాయి. 'మీరు ఎంత మంది పిల్లలను కనాలంటే అంతమందిని కనండని, పుట్టిన ప్రతి బిడ్డకూ రూ.1500 చొప్పున చెల్లిస్తామంటూ' బహిరంగంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ముగ్గురు అంతకంటే ఎక్కువ సంతానం కలిగి ఉంటే అనర్హులన్న నిబంధనను ఎత్తేసింది. డీలిమిటేషన్ పూర్తయితే అసెంబ్లీకి 75 మంది మహిళలు వస్తారంటూ అసెంబ్లీలో సైతం బాబు చెప్పుకొచ్చారు. ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉంటే పోటీకి అర్హులు కాదని బిల్లుకు తీసుకురావాల్సిన అవసరముందని అసెంబ్లీ సమావేశాల్లో బాబు మాట్లాడారు. దానికి అనుగుణంగా ఎంపీ సీట్లు పెరిగే అవకాశాలూ లేకపోలేదు. అదీ గాక జనాభా వృద్ధిపై అమరావతిలో 'దేశాభివృద్ధిలో జన భాగస్వామ్యం' పేరుతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇదే అంశంపై బాబు చేసిన ప్రసంగంలో బీహార్, యూపీ కంటే మనకు సీట్లు తగ్గిపోతాయనే ఆవేదనే కనిపించింది. ఎపి అభివృద్ధి అంటూ జపం చేసిన బాబు అకస్మాత్తుగా రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటును 1.5 శాతం నుంచి 2.1 శాతానికి పెంచడానికి ప్రణాళికలు వేస్తున్నట్లు ఇటీవల ఓ వర్క్‌షాప్‌లో ప్రకటించారు. అంతే కాదు బోలేడు వరాలూ ప్రకటించారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని కాన్పులైనా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేస్తామని వాగ్దానం చేశారు. జనాభా తగ్గితే ఎంపీ సీట్లు తగ్గుతాయన్న భావన ఉంది. కానీ, తాను అలా ఆలోచించడం లేదంటూ మనసులో మాటనూ చెప్పేశారు. జపాన్, జర్మనీ వంటి దేశాలు భారతీయులు కోసం ఎదురుచూస్తున్నాయంటూ అర్జెంట్‌గా పిల్లలను కనాలని చెప్తున్నారు. బీహార్, యూపీ, వంటి రాష్ట్రాలకు జనాభా ఇబ్బంది లేకుండాపోయిందని చెప్తూ వారికి సీట్లు పెరుగుతాయన్న ఆవేదన కూడా మాటల్లో కనిపించింది.

జనాభా పెరగాలని చెప్తూనే చంద్రబాబు మరో వైపు దాని వల్లే కలిగే అనర్ధాలనూ చెప్పడం గమనర్హం. నీటి లభ్యత, ఆహార ఉత్పత్తి పెరగకుండా జనాభా పెరిగితే ఇబ్బందులు వస్తాయంటూ చెప్పకనే చెప్పారు. జనాభా విశృంఖలంగా పెరిగిపోతున్న నేపథ్యంలోనే చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబం వంటి నినాదం పుట్టుకొచ్చింది. ఒకరు ముద్దు... ఇద్దరు వద్దు అంటూ అప్పట్లో వైద్య ఆరోగ్యశాఖ విస్తృతంగా ప్రచారం చేసింది. జనాభా క్రమేణా పెరుగుతుండటంతో వ్యవసాయ భూమిని పరిశ్రమల స్థాపన, రియల్ ఎస్టేట్ వంటి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న పరిస్థితిని చూస్తున్నాం. దీంతో ఉత్పాదకత క్రమేణా తగ్గిపోతోంది. నీటి లభ్యత లేక ఇప్పుడున్న జనాభాకే కావాల్సిన తాగునీటిని అందివ్వలేని పరిస్థితిని చూస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలో రోజుకి 70 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా, 55 లీటర్ల నీటిని మాత్రమే అందించగలుగుతున్నారు.

జనాభా పెరుగుదలతో నిరుద్యోగం తాండవిస్తోంది. ఉపాధి లేక, బతికే దారి లేక జిల్లా నుంచి వేలాది కుటుంబాలు వలస వెళ్లిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. కుటుంబ షోషణే భారంగా మారిన ఆ కుటుంబాలకు ముగ్గురేసి పిల్లలను కనాలని చెప్పడం సమంజమేనా? మూడో సంతానం కంటే నగదో మరొకటో ప్రోత్సాహం ఇవ్వడం సరే జీవిత కాలం వారి బాగోగులు ఎవరు చూస్తారు. మూడు పూటలా కడుపు నిండా తినడమే కష్టంగా మారిన ఆ కుటుంబాలకు చెందిన పిల్లల చదువులు, వారి ఉపాధికి ఎవరు భరోసా ఇస్తారు? నియోజకవర్గాల సంఖ్యను పెంచుకుని తమ పార్టీకి చెందిన నేతలకు ఎమ్మెల్యే పదవులు ఇప్పించుకోవాలనే తపన తప్ప ఇందులో పేద, మధ్య తరగతి ప్రజలకు ఏం మేలు ఒనగూరుతుంది. ఎన్ని కాన్పులయినా ప్రసూతి సెలవులు ఇస్తామని చెప్తున బాబు ఉద్యోగం చేసే మహిళలు ఎందరు ఉంటారు? భవన నిర్మాణ పనులు, వ్యవసాయ కూలి చేసే మహిళలకు, ఇతర సాధారణ గృహిణులు ఏం ఇస్తారు. పని చేయగా వస్తున్న సంపాదనతో సక్రమంగా పౌష్టికాహారమే తీసుకోలేక రక్తహీనత భారిన పడుతున్న వైనాన్ని మనం చూస్తున్నాం. చిన్నారుల్లోనూ అదే పరిస్థితి ఉన్నట్లు ఐసిడిఎస్ సర్వేలో స్పష్టమైంది. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్ధాలు అన్నీఇన్నీ కావు. ఆర్థికశాస్త్రం అభ్యసించిన బాబుకు ఇవేవి తెలియక కాదు. అధిక సంతానానికి సామాజిక పరిస్థితులు కూడా ప్రస్తుతం అంత అనువుగా లేవు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో పిల్లల బాధ్యతలను తల్లితో పాటు మిగతా వారూ చూసుకునేవారు. ఆదాయం చాలక దంపతులు ఇద్దరూ పని చేయాల్సి రావడంతో వారు వేరు పడి పట్టణాల్లో ఉండాల్సి వస్తోంది. ఇద్దరిని పెంచడం కష్టసాధ్యంగా మారింది. దీంతో ప్రస్తుతం ఒక్కరితోనే సరిపెట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. జనాభా పెంచి, సీట్లు పెంచుకునే రాజకీయ లక్ష్యం తప్ప ఇందులో ప్రజలకు ఏం ప్రయోజనం? కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా ప్రతి నిర్ణయానికీ తలూపుతున్న చంద్రబాబు జనాలకు కష్టాలపాల్జేయడానికి వెనుకాడటం లేదు. డీలిమిటేషన్‌కు జనాభా లింకు పెట్టకుండా ప్రత్యామ్నాయాలు చూడాలని కేంద్రానికి చంద్రబాబు ఎందుకు చెప్పలేకపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా నిలబడితే ప్రజలకు అధిక సంతానం కనాల్సిన పని ఉండదు కదా!

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
IA 184/2023 in OS 49/2017

Between:
Puppala Gangadhara Rao (died) and another ....petitioners/plaintiffs
And:-
Dharmana Dharmarao and others .....Respondents/Defendants
To,
R-9: Killam setty Jayasri W/O of Prakasarao (late) R/A New day & night junction Dr.panduranga Rao hospital Srikakulam Town and District.
R-10: Killamsetty Pradeep Kumar S/o Prakasarao (late) R/A New day & night junction Dr.panduranga Rao hospital Srikakulam Town and District.
R-11: Kinthali @Killamsetty promoda, D/o Prakasarao (late) R/A New day & night junction Dr.panduranga Rao hospital Srikakulam Town and District.

Notice to the Respondents 9 to 11

It is inform you that the above IA 184/2023. In OS 49/2027 on the file of the Hon'ble1st Additional District Judge AT Srikakulam District. Is posted to 20/03/2025. For your appearance. You are here by directed to appear before the above court at **10.30 AM on 20/03/2025** in person or through advocate without fail, otherwise the matter will be decided on your absence.

//By Court Order//

Palisetti Murali Krishna
Advocate,
New colony, Srikakulam,
Cell: 9440371133.


జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

పలాస : ప్రభుత్వం ప్రయాణికులకు మరింత ఆర్‌టిసి సేవలను చేరువ చేసేందుకు నూతన బస్సులను ఏర్పాటు చేస్తుందని, దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం ఒకటి, పలాస నుంచి విజయవాడకు వెళ్లే రెండు బస్సులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణ, ఎం.నరేంద్ర, దొక్కరి శంకర్, డిపో మేనేజర్ ఆర్.సీతారామనాయుడు, డిప్యూటీ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి– ఆమదాలవలస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

నియోజక వర్గంలోని ఆమదాల వలస, బూర్జ మండలాల్లోని కెజిబివిల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ.3 కోట్ల 20 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆమదాలవలస, బూర్జ మండలాల కెజిబివిల్లో జూనియర్ కళాశాలల అదనపు గదుల నిర్మాణానికి ఒక్కో కెజిబివికి రూ.1.60 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల మంజూరుతో విద్యార్థుల ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. కెజిబివిలకు నిధులు మంజూరు చేసినందుకు సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మహిళలకు పింక్ మరుగుదొడ్లు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్


పట్టణంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న జిల్లా గ్రంథాలయంలో, ఉమెన్స్ కాలేజీలో పింక్ టాయిలెట్లు ఏర్పాటుకు ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పబ్లిక్ ప్రాంతాల్లో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టాయిలెట్ల ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లా గ్రంథాలయం వద్ద వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యాలయానికి సమాచారం కోసం వస్తుండడం వలన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ టాయిలెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఉమెన్స్ కాలేజీలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే దిశగా ఈ టాయిలెట్స్ నిర్మాణం జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన దిశగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

హైస్కూల్‌కు పరికరాల అందజేత

ప్రజాశక్తి– రణస్థలం

యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ, ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ బెంగళూరు సహకారంతో ఎడ్యుకేట్ ఫార్వర్డ్ వారు మండలంలోని అర్జునవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ కొరకు అవసరమైన రూ.లక్ష విలువగల ప్రొజెక్టర్, ల్యాప్‌టాప్, స్క్రీన్, స్పీకర్స్‌ను ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, వై.సి.బి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రసాద రావు చేతులమీదుగా పాఠశాల హెచ్‌ఎం బి.భాస్కరరావుకు శనివారం అందజేసి స్మార్ట్ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో వై.సి.బి. ఐపిఎల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి. మాధవి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సెక్రటరీ సిహెచ్. జనార్ధనరావు, బెజ్జిపురం యూత్ క్లబ్ కమ్యూనిటీ నిర్వాహకులు వై.శంకరరావు, ఎ.రమణమూర్తి పాల్గొన్నారు. అలాగే స్మార్ట్ క్లాస్ రూమ్ ఇన్‌ఛార్జిగా బి.నరసింహులను నియమించారు.


గాంధీమందిరాన్ని సందర్శించిన స్కౌట్ బృందం

స్కౌట్స్ బృందం సందర్శన

ప్రజాశక్తి– అరసవల్లి

దేశం కోసం, ధర్మం కోసం స్వాతంత్ర స్ఫూర్తిని సేవా నిరతిని బాల్యం నుంచే అలవర్చుకునేందుకు నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతివనం సందర్శనం ఎంతగానో దోహదపడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రజియా బేగం, నాగిరెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కౌట్స్ బృందాలు వారికి సమన్వయం చేసే స్కౌట్ అధికారులతో కలిసి గాంధీ మందిరాన్ని సందర్శించారు. జిల్లా స్కౌట్ సమన్వయకర్తలు రాజేంద్రప్రసాద్, వాగ్దేవి, బుజ్జితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు సమరయోధుల స్మృతి వనంలో కొలువుతీరిన మహనీయుల చరిత్రను విద్యార్థులకు వివరించారు. దేశంలో తామెక్కడ ఇంతటి గొప్ప ప్రదేశాన్ని చూడలేదని స్కౌట్ రాష్ట్ర కార్యదర్శులు రజియా బేగం, నాగిరెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు. భావితరాలకు దేశంపై బాధ్యతను పెంచే గొప్ప పుణ్యక్షేత్రంగా తాము భావిస్తున్నామన్నారు. స్కౌట్ విద్యార్థులకు స్వాతంత్రోద్యమంలో సైనికుల తిరుగుబాటు మొదలు నేటి వరకు ఉన్న పరిస్థితులను వారికి వివరించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి సామూహికంగా రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తనలు ఆలపించారు.

రేపు 'చలో విజయవాడ'

టెక్కలి : మెళియాపుట్టిలో ఐటిడిఎని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎని ఏర్పాటు చేయాలని, జిల్లాలో బిసిఎకి చెందిన వడ్డిలకు ఒరియా ధ్రువపత్రాలు మంజూరు చేయరాదని డిమాండ్ చేశారు. నకిలీ పట్టాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనేతరులను ఎస్‌టి జాబితాలోకి తీసుకు రాదన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు చేపట్టనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత



పాతపట్నం : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు


లావేరు : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ, పట్టణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్ప పేట, సింగుపురం మార్కెట్, గార మండలం వమరవెల్లి డైట్ కళాశాల, శ్రీకాకుళం పట్టణంలోని సాయినగర్ కాలనీ స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించుకోవచ్చునని, మున్సిపల్ సిబ్బందితో పాటు, పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, డైట్ కళాశాల సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం: పరిశుభ్రత పాటిద్దాం... స్వర్ణాంధ్ర సాధిద్దామని, ప్లాస్టిక్ సంచులు వాడకం మానేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. పాతపట్నంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టణాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పార్కులు వంటి ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే పట్టణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, మండల ప్రత్యేక అధికారి కరుణాకరరావు, ఐసిడిఎస్ పిఒ విమలారాణి పాల్గొన్నారు.

ఆమదాలవలస: సమాజంలో రోజురోజుకూ అడుగంటుతున్న పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు బోర గోవిందరావు, సంపదరావు మురళీ, రెడ్డి రాంబాబు, నాగళ్ల మురళీధర్ యాదవ్, బోయిన సునీత, మున్సిపల్ అధికారులు పివివికె రాజు, తమ్మినేని గోవిందరావు, అమర్నాథ్, స్వయం సహాయక సంఘ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావు అన్నారు. లావేరులో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే గురుగుబిల్లిలో సర్పంచ్ బాడిత కళ్యాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు కార్యక్రమంలో వెలుగు ఎపిఎం బి.వి. సబ్బయ్యనాయుడు, నాయకులు బాడిత లక్ష్మణరావు, చిట్టిబాబు, డీలర్ హరికృష్ణ, వెలుగు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వం పాలిథిన్ సంచులను నిషేధించిందని వాటిని ఎవరైనా వినియోగిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ మీసాల మన్మధరావు, తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు పేర్కొన్నారు. పొందూరులో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌లో ప్రతి దుకాణానికి వెళ్లి పాలిథిన్ సంచులు నిషేదంపై వివరించారు.. అలాగే ఆడపిల్ల సేవా సొసైటీ చైర్మన్ మద్ది లావణ్య గుడ్డ సంచులను, పేపర్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇఒపిఆర్‌డి సింహాచలం, టిడిపి మండల అధ్యక్షుడు రామ్మోహన్, ఇఒ మోహన్‌బాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీరంగనాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్వచ్ఛాంధ్రలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ, నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపైనా ఉందని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్వచ్ఛాంధ్రాలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఇచ్ఛాపురం : స్వర్ణాంధ్రాలో భాగంగా కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన మున్సిపాలిటీ గాంధీ పార్కు వద్ద మెగా క్లీన్ డ్రైవ్ చేపటారు. ఇందులో భాగంగా కార్యాలయంలో మెప్మా సిబ్బంది ఆధ్వర్యాన క్లాత్ బ్యాగ్‌లను చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి పంపిణీ చేశారు. ముందుగా కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి బస్ స్టాండ్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, సానటారు ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

కవిటి : ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిశుభ్రత పాటించి స్వర్ణాంధ్రను సాధిద్దామని బి.జి.పుట్టుగ ప్రధానోపాధ్యాయుడు బాబూరావు అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి – భూమిని కాపాడండి, నీటిని ఆదాచేద్దాం – జీవుల్ని రక్షిద్దాం, పరిశుభ్రత పాటించి ప్రకతిని కాపాడుతాం, మొక్కల్ని నాటుతూ భవిష్యత్తును రక్షిద్దాం అనే నినాదాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

అలాగే కవిటిలోని వ్యాపారులకు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒ వీరభద్ర స్వామి, ఇన్‌ఛార్జి ఎపిఒ మోహనరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భూపతి పాల్గొన్నారు.

నందిగాం: స్వర్ణాంధ్రలో భాగంగా పెద్దతామరాపల్లి పాఠశాలలో ఎంఇఒ నర్సింహులు ఆధ్వర్యాన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బాలక శంకర రావు, వి.కుమారి, పి.వనతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండలంలోని జోడూరులో పరిసరాల పరిశుభ్రతపై మండల ప్రత్యేకాధికారి లింగాల వెంకట మధుబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒలు ఎస్.దేవేదరరావు, ఎ.పద్మనాభరావు, ఎఒ దానకర్ణుడు, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలోని పలు పంచాయతీల్లో అధికారులు స్వర్ణాంధ్రకార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చిన్నతుంగాం సచివలయం పరిధిలో మండల ప్రత్యేక అధికారి బి.తిరుమలరావు, ఎంపిడిఒ జయంతి ప్రసాద్, పిఒపిఆర్‌డి పద్మజ, సర్పంచ్ సిమ్మ గోవిందరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.చైతన్య, నౌపడ పిహెచ్‌సిలో డాక్టర్ పరిమళ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు.

టెక్కలి రూరల్ : పరిశీలించారు పరిశుభ్రంగా ఉంచాలని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ సూర్యారావు ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ నీలవేణి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : స్వచ్ఛాంధ్రలో భాగంగా మండలంలోని డోకులపాడులో ఎపిఎం జి.ప్రసాదరావు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి యాదవ్ రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ ధనుజయ్, మహిళా పోలీస్ హేమలత, సచివాలయ సిబ్బంది వాసు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఇఒ రమణమూర్తి అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యా కమిటీ చైర్మన్ బమ్మిడి లక్ష్మీపతి ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్


ఆమదాలవలస: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


పొందూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జీడి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి– పలాస

జీడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాశీబుగ్గ ఎన్ఎంసి పంక్షన్ హాల్లో పిసిఎంఎ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీడితో వచ్చిన ప్రతి వస్తువునూ వినియోగించుకొని కొత్త ఆలోచనతో పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక కార్మికులు ఆలోచన చేయడం ద్వారా మరింత లబ్ధి పొందవచ్చాన్నారు. జిల్లాకు ఎయిర్‌పోర్టు కావాలనే ఉద్దేశంతో పలాస ప్రాంతంలో నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం మంత్రులు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు పిసిఎంఎ కార్యవర్గ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పిసిఎంఎ అధ్యక్ష, కార్య దర్శులు మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకరుప్తా, ట్రెజరర్ మల్లా సంతోష్‌కుమార్, జీడి వ్యాపారులు శాసనపురి మురళి, నారాయణరావు, మల్లా భాస్కరరావు, తరాన రమేష్ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలి

80 కిలోల జీడి బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని ఎపి జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, పలాస డివిజన్ రైతాంగ కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావులు కోరారు. పలాస పర్యటనకు వచ్చిన మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారిగా ఏర్పాటు చేసి నాణ్యమైన


వినతిపత్రం అందజేస్తున్న అజయ్‌కుమార్

జీడిమెక్కలను రైతులకు అందించాలని కోరారు. జీడి, కొబ్బరి బోర్డులను పలాసలో ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్.గణపతి, కొనేరు రమేష్, మడ్డు రాఘవ రావు, మద్దిల రామారావు, కొనేరు ఆదినారాయణ, సురేఖ, లండ రాజేశ్వరి, దాసరి శ్రీరాములు, జి,చలపతిరావు, బొడ్డు సింహాద్రి, రామారావు, హేమారావు చౌదరి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు శక్తి బృందాలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి – గుజరాతీపేట

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలను పది నిమిషాల్లో రక్షించడమే లక్ష్యంగా శక్తి బృందాల సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. మహిళల భద్రత, రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ద్వారా ఆపద సమయంలో మహిళలు, బాలికలను రక్షించేందుకు తక్షణమే స్పందించి చేరుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన శక్తి బృందాలకు కేటాయించిన 30 పెట్రోలింగ్ వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసు అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందానికి ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షణ పనిచేస్తారని తెలిపారు. జిల్లాలో ఉన్న మూడు సబ్ డివిజన్లకు ఒక్కో శక్తి టీమ్‌ను కేటాయించామని, శ్రీకాకుళం నగరానికి అదనంగా రెండు బృందాలను కేటాయించినట్లు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని శక్తి బృందాలను పెంచుతామని తెలిపారు. శక్తి బృందం సభ్యులు శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు అందిన, డయల్ 112 కాల్స్ ద్వారా సమచారం అందిన పది నిమిషాల్లో సంఘటనా


పెట్రోలింగ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మహిళా పోలీసు అధికారులు

స్థలానికి చేరుకుని తక్షణ సహాయం అందిస్తారన్నారు. పబ్లిక్ ప్రదేశాలు, మార్కెట్, బస్టాండ్, రైల్వేస్టేషన్లు, పార్కులు తదితర ప్రదేశాల్లో ఈ బృందాలు విధులు నిర్వహిస్తుంటాయన్నారు. సదరు ప్రదేశాల్లో ఎటువంటి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా జిల్లాలో తొలిసారిగా మహిళా సిబ్బందితో డ్రోన్ కెమెరాలను వినియోగించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించనున్నట్లు తెలిపారు. సంకల్పం కార్యక్రమం పేరుతో పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామస్థాయిలో సందర్శించి శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ఆత్మరక్షణపై పోలీస్ సిబ్బంది, నైపుణ్యం గల శిక్షకులతో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చేసుకొని అత్యవసర సమయంలో పోలీసు సహాయాన్ని పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు వివేకానంద్, శేషాద్రి, సిఐలు పైడిపునాయుడు, ఈశ్వరరావు, ఎం.అవతారాం, ప్రసాదరావు, మహిళా ఎస్ఐలు ప్రవళిక, హైమావతి, స్వర్ణలత, ఎస్ఐలు, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పేడాడ కామేశ్వరరావు విఎల్ఎస్ఐ డిజైన్ – ప్రిన్సిపుల్స్ అండ్ అప్లికేషన్స్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం ఆవశ్యకతను వివరిస్తూ ఇసిఇ, ఇఇఇ విభాగాల్లో బిటెక్, ఎంటెక్ కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్న వారికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెడ్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్ఒడి వి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

కాలుష్యం నుంచి నదులను రక్షించుకోవాలి

కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ


నదిలో శుభ్రం చేస్తున్న అధికారులు, సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి– శ్రీకాకుళం.అర్బన్

జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయ నదులను కాలుష్యం కోరల్లో చిక్కుకోకుండా పరిరక్షించాల్సిన అవసరం ఉందని కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కరుణశ్రీ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో నాగావళి నదిలో స్వచ్ఛ శ్రీకాకుళం – స్వచ్ఛ నాగావళి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని నాగావళి నదిలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్యాన్ని నిరోధించే కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని, విద్యా సంస్థలు, పర్యావరణ పరిరక్షణ సంస్థలు కలిసికట్టుగా నదుల శుద్ధికి కృషి చేయాలని తెలిపారు. నదుల దురాక్రమణ పర్యావరణ వినాశనానికి, నీటి వనరుల క్షీణతకు కారణమవుతున్నాయని దీనిని తక్షణమే కట్టడి చేయకపోతే మానవ మనుగడకు ముప్పు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, ఆంధ్రా ఆర్గానిక్స్ లిమిలెడ్ (ఎఒఎల్) ఎం.కృష్ణయ్య, అపర్ణ ఫార్మాసూటికల్ ప్రయివేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ శ్యామ్ బాబు, అపిటోరియా ఫార్మా, ఎస్ఎసిఎల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్ లైజినింగ్ ఆఫీసర్ ప్రసాద్, మహాధన్ పరిశ్రమ హెచ్ ఆర్ రాజేష్, సరాక కంపెనీ ప్రతినిధి ఎ.బ్రహ్మారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎప్టోరియా కంపెనీ జనరల్ మేనేజర్ సంపత్‌రెడ్డి, నాగార్జున అగ్రికమ్ లిమిటెడ్ ప్రతినిధులు, మెడికవర్, జెమ్స్, రిమ్స్, కిమ్స్, సాయి డెంటల్ కాలేజీ, గొలివి, శంకర్ కంటి ఐ ఆస్పత్రి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి జైలు

ప్రజాశక్తి– రణస్థలం రూరల్

నాటుసారాతో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లగుడు అనురాధా దేవి శనివారం తెలిపారు. సీతంపేట మండలం జోడిమానుగూడకు చెందిన సవర సుధాకర్ 2021 నవంబర్ 23న కారులో 300 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకొని క్రైం నంబర్ 287/2021తో కోర్టులో కేసు రిజిస్టర్ చేశారు. ఈ కేసులో ఒకటవ ముద్దాయి సవర సుధాకర్‌కు ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ప్రొహిబిషన్, ఎక్సైజ్) శ్రీకాకుళం వారు ఒక సంవత్సరం జైలుశిక్షతో పాటు రూ.2 లక్షలు జరిమానా విధించడం జరిగిందన్నారు. ముద్దాయి జరీమానా చెల్లించలేకపోతే అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆ తీర్పులో పేర్కొన్నారని, ముద్దాయికి శిక్ష అమలుపర్చే నిమిత్తం అంపోలు జిల్లా కారాగారానికి తరలించినట్లు తెలిపారు.


చిందరవందరగా పడేసిన దుస్తులు

రెండు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి– పలాస

పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో శుక్రవారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. పలాస శివాజీ నగర్‌లో పాడి చంద్రశేఖర్ ఇంట్లో 14 తులాలు వెండి, తులం బంగారం, రూ.50 వేలు నగదు, మారుతీ నగర్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఇంట్లో రూ.10 వేల నగదు, అర కిలో బరు ఉండే వెండి ఆభరణాలు అపహరించారు. మారుతీ నగర్‌లో ఉన్న చంద్రశేఖర్ అమ్మవారి స్వగ్రామం నందిగాం మండలం జడ్యాడ శుక్రవారం కుటుంబంతో వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా నగదు, వెండి ఆభరణాలు మాయం అయినట్లు గుర్తించారు. కొద్ది నెలల క్రితం దొంగలు చొరబడి బంగారు నగలు, నగదు అపహరించారని వాపోయారు. అదేకాలనీలో కె.కాళిదాస్ ఇంట్లోనూ దొంగతనానికి ప్రయత్నించి విఫలమయినట్లు బాధితులు తెలిపారు. అలాగే శివాజీనగర్ లో నివాసం ఉంటున్న పాడి చంద్ర శేఖర్ ఎసి మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పాతపట్నం వివాహానికి కార్యక్రమానికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో వెళ్లి చూడగా 14 తులాలు వెండి ఆభరణాలు, తులం బంగారం, రూ.50 వేలు నగదు అపహరించారని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించారు. సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ సిఐ బేబీ

నాటుసారాతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి– సోంపేట

సోంపేట ఎక్సైజ్ పరిధిలోని కంచిలి మండలం జెభుయా, దోళాయి రాజు వ్యక్తులు శనివారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబీ తెలిపారు. వీరి వద్ద నుంచి 210 లీటర్ల నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంఘటనలపై కేసులు నమోదు చేసి నట్లు తెలిపారు. ఈ దాడుల్లో జివి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెదసాన పాఠశాల వద్ద ఉద్రిక్తత

- తెలుగు ఉపాధ్యాయుని సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్
- హెచ్‌ఎం దిష్టిబొమ్మను దహనం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి– టెక్కలి

మండలంలోని పెదసాన గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులు, గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టడంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన ఎలుగు ప్రసాద్‌ను ఇటీవల డిఇఒ సస్పెండ్ చేశారు. దీంతో ఉపాధ్యాయునిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాల గేటు ముందు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ వివాదానికి ప్రధానోపాధ్యాయుడు బొడ్డేపల్లి నేతాజీ కారణమంటూ ఆరోపిస్తూ... హెచ్‌ఎం దిష్టిబొమ్మని ఊరేగించి పాఠశాల ముందు దగ్ధం చేశారు. అంతకుముందు విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. విద్యార్థులు హాజరుకాకపోవడంతో అమలు కావాల్సిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం నిలిచిందిపోయి ప్రసాద్ ఎస్‌సి తరగతి చెందిన వారు కావడంతో హెచ్‌ఎం ఉద్దేశ్యపూర్వకంగానే సస్పెండ్ చేయించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే ఆందోళన చేస్తున్న సమయంలో సస్పెండ్ అయిన తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద్ పాఠశాల గేటు ముందు ఉండడం విశేషం. సమాచారం అందుకున్న సిఐ అంబటి విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై మండల ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి ప్రాథమిక నివేదిక చేపట్టారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నగదు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రభుత్వ సాయం అందజేత

ప్రజాశక్తి- టెక్కలి

...టెక్కలి పంచాయతీ పరిధిలోని విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేసే కార్మికునిగా విధులు నిర్వహించిన బి.బాలరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.50 వేల ఆర్థికసాయం విడుదలైంది. దీనిని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మృతుడి భార్య ధనలక్ష్మికి అందజేశారు. అనంతరం టిడిపి కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన పలు వినతులు స్వీకరించి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, చౌదరి బాబ్జి, టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, ఎల్.నాయుడు, మెండ దమయంతి, దల్లి ప్రసాద్‌రెడ్డి, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

టైలరింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ వెనుకబడిన తరగతుల (బిసి) మహిళలకు, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి), అగ్రవర్ణాలలోని 'పేద (ఇడబ్ల్యుఎస్) కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఇబిసి ఆర్య వైశ్య, బ్రాహ్మణ వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఇడి గడ్డెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉచితంగా కుట్టుమిషన్ అందజేస్తామన్నారు. మహిళా అభివృద్ధికి తోడ్పడే ఈ శిక్షణలో పాల్గొనేందుకు అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. శిక్షణా కాలం 45 రోజులు (రోజుకి 8 గంటలు), 60 రోజులు (రోజుకి 6 గంటలు), 90 రోజులు (రోజుకు 4 గంటలు) ఉంటుందన్నారు. కోర్సులో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలన్నారు. శిక్షణా కాలంలో 75 శాతం హాజరు తప్పనిసరని, ఆన్‌లైన్ ముఖం యాప్‌లో నమోదు కావాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు తెలుపు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మొబైల్ నంబర్ అవసరమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22లోగా సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.8 లక్షలతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక డిగ్రీ కళాశాల సిబ్బంది క్రీడా మైదానం అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారరని అన్నారు. ఈ క్రమంలో రూ.8 లక్షలు మంజూరు చేసి ట్రాక్ నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన కాలువ

పంట కాలువ ఆక్రమణ

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలోని గోపినాథపురానికి చెందిన ఊర చెరువుకి సాగునీరందించే వంశధార 49 ఆర్ కాలువ గట్టుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆక్రమించారని ఆ ప్రాంతానికి చెందిన రైతులు వాపోతున్నారు. గడచిన దశాబ్దాల కాలం నుంచి వంశధార మెయిన్ కెనాల్ నుంచి సాగునీరు వస్తుందన్నారు. స్థానిక తెలుకల వీధి వద్ద ఉన్న కాలువ గట్టుని పలాసకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆక్రమించి మట్టి కప్పుతూ కాలువను ఆక్రమించారని వాపోయారు. ఈ కాలువ ఆక్రమిస్తే సుమారు వందలాది ఎకరాలకు సాగునీరు లభ్యత కష్టంగా మారుతుందన్నారు. దీనిపై వంశధార ఆయుకట్టు, రెవెన్యూ అధికారులు స్పందించి కాలువ ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న చలం

చలంకు ప్రశంసాపత్రం

మెళియాపుట్టి: యోగదారులను చైతన్య పరుస్తూ జిల్లా విద్యార్థి వినియోగదారుల క్లబ్బులు మాస్టర్ ట్రైనర్‌గా ఎల్.వి.చలం వ్యవహరిస్తున్నారు. ఈయనకు జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు ప్రశంసించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళ: బాలురు డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా చలంకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బగాది రామ్మోహన్, బమ్మిడి నరేంద్ర పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కి నివాళి




చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కొత్తూరు: మండల కేంద్రంలో బహుజన రాజకీయ సిద్ధాంతకర్త పంట కాన్షీరామ్ 91వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. సిబిఎస్‌పి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి కృష్ణా రావు కొత్తూరులోని కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డి.జమ్మయ్య మాష్టారు, బొడ్డేపల్లి రామకృష్ణ, గుడబండి సింహాచలం, మురపాక శంకరరావు, సల్ల మన్మథరావు, తలచంద్రి రాంబాబు, సుబ్బారావు, తేగల బుడ్డు, అలికాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అండర్ పాసేజ్‌తో ఆటంకం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని బూరగాం పంచాయతీ రామేశ్వరం వద్ద ఉన్న రైల్వే గేట్ వద్ద నిర్మాణం చేపట్టిన అండర్ పాసేజ్‌తో ఆ ప్రాంత వాహనాలకు ఆటంకంగా మారుతుంది. సంతబొమ్మాళి మండలం మర్రిపాడు నుంచి టెక్కలి మండలం శాసనాం జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న రోడ్డును గత టిడిపి ప్రభుత్వ హయాంలో వెడల్పు చేపట్టారు. భావనపాడు వద్ద పోర్టు నిర్మిస్తే ఈ మార్గం ప్రధాన రహదారిగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో రోడ్డు వెడల్పు చేపట్టారు. అయితే తర్వాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం మూలపేట వద్ద పోర్టు నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ మార్గానికి డిమాండ్ తగ్గింది. అయితే రెండు మండలాలను కలుపుతూ చేపట్టిన ఈ రహదారి నిర్మాణం వినియోగంలోకి వస్తుంది. ఇటువంటి నేపథ్యంలో ఈ మార్గంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా పెరుగుతుంది. పోర్టుకు వెళ్లే రహదారి అని చెబుతూ ప్రచారం సాగిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ఉన్న రామేశ్వరం రైల్వే గేట్ వద్ద చేపట్టిన అండర్ పాసేజ్ నిర్మాణం ఆటంకంగా మారుతుంది. ఈ మార్గంలో ఆటో, చిన్నపాటి కార్లు తిరిగేందుకే అవకాశం ఉంది. ఇదే గాక ఈ మార్గంలో బస్సులు, లారీలు తిరిగే అవకాశమూ కనుమరుగైంది. గతంలో ఈ మార్గంలో బస్సు సౌకర్యమూ ఉండేది. కానీ, అండర్ పాసేజ్ నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ఈ ప్రాంతంలో తిరిగే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై సంబంధిత రైల్వే శాఖాధికారులు దృష్టి సారించి గతంలో ఉన్న రోడ్డు కూడా వినియోగంలోకి తీసుకువస్తే మంచిదని పలువురు కోరుతున్నారు.



అండర్ పాసేజ్

టిడిపి శ్రేణుల్లో ఆందోళన

ఇచ్ఛాపురం: వైసిపి నేతలతో ఏస్థాయిలోనూ సత్సంబంధాలు వద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రకటన చేశారు. దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పలువురు టిడిపి నేతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకు వైసిపి నేతలతో చెట్టాపట్టాలు వేసుకుంటున్న టిడిపి నాయకులు గుబులు చెందుతున్నారు. కొంతమంది వైసిపి నేతలతో ఉన్న స్నేహ సంబంధం, మరికొంత మందికి బంధుత్వం ఉండడంతో ఇప్పటివరకు పార్టీలు వేరైనా కలిసి మెలిసి తిరుగుతున్నారు. మున్సిపల్ స్థాయి వైసిపి నేత ఒకరు అయితే ఏకంగా ప్రభుత్వ విప్ అశోక్ భజన చేస్తూ... తనకు, మీ పార్టీ ఎమ్మెల్యేతో మంచి సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేసుకొని పబ్బం గడుపుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే టిడిపి నేతలు, చేస్తున్న ప్రచారంపై విప్‌కి చెప్పలేకపోతున్నారు. నిన్న, మొన్నటి వరకు టిడిపి, విప్‌ను వైసిపి నాయకులు దుర్భాలాషలాడారు. రాష్ట్రంలో వైసిపి పరాజయం తరువాత ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా తప్పించు కునేందుకు ఉద్దేశపూర్వకంగా కొంతమంది వైసిపి నాయకులు టిడిపి నాయకులతో రాసుకుపూసుకుని తిరుగు తున్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా చంద్రబాబు స్వయంగా ఏ స్థాయిలోనూ వైసిపి నేతలతో సంబంధాలు వద్దని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో నామినేటెడ్ పదవులు, భవిష్యత్‌లో పార్టీ టిక్కెట్లు ఆశించే వారికి పెద్ద ఎదురు దెబ్బే. ఈ ప్రకటన విప్ భజన చేస్తున్న పట్టణానికి చెందిన వైసిపి నాయకుడుకి మింగుడు పడటం లేదు. వైసిపి అధికారం లేకపోయినా ఇంకా మున్సిపల్ స్థాయిలో తన ముద్ర కొనసాగించాలని చేస్తున్న ప్రయ త్నాలు టిడిపి నాయకులు గమనిస్తున్నారు. ఎప్పటిలాగా వైసిపి, టిడిపి నేతల జోడి ఇక రహస్యంగా ఉండా ల్సిందే తప్ప బహిరంగ ఉంటే భవిష్యత్ రాజకీయాలకు గండి తప్పదు.



మందస : మాట్లాడుతున్న కూర్మారావు

ప్రకృతి వ్యవసాయంతో మేలు

మందస: గ్రామీణ ప్రాంతంలో రైతులందరికీ వచ్చే ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం అవగాహన కల్పించి నేల తల్లి ఆరోగ్యం పాడు చేసే 'రసాయనాలు వద్దు కాషాయాలే ముద్దు' అని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు రైతులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో డిపిఎం రేవతి అధ్యక్షతన ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేల స్వభావాన్ని బట్టి సేంద్రీయ పద్ధతిలో పశువుల ఎరువు, పెంటగత్తం, కుళ్లిన ఆకులు వ్యవసాయ వ్యర్థాలతో తయారైన కంపోస్టును ఉపయోగించాలన్నారు. ఘనజీవామృతం, జల జవామృతాలను ఉపయోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వివరించారు. పంటలకు వచ్చే చీడపీడల నివారణకు రసాయన క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా గోమూత్రం, వేప ఆకులు తదితర మిశ్రమాలతో తయారు చేసిన కషాయాలను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, శ్రీరామ్‌కుమార్, ఎఒ నాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు, ఎఒ భార్గవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనర్ల రమణ, దుర్గాప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కవిటి: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడమే కాకుండా భూసారాన్ని పెంపొందించి పౌష్టిక ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని ఎపిఎం గోవిందరావు, అడిషనల్ డిపిఎం ధనుంజయ్ తెలిపారు. కవిటి మహిళా సమాఖ్య భవనంలో మండల స్థాయి కెఎపి సమన్వయ సమావేశం నిర్వహించారు. డిఎంఎంటి తులసయ్య, ఐసిఆర్‌పిలు స్వాతి, సంతోషి పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న చిరంజీవి

హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులకు చట్టంపై అవగాహన ఉండాలని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యాన శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు బగాది రామ్మోహనరావు అధ్యక్షత వహించారు.నీ సందర్భంగా న్యాయమూర్తి చిరంజీవి పాల్గొని మాట్లాడుతూ వినియోగదారులు జరుగుతున్న మోసాన్ని ప్రశ్నించేతత్త్వం కలిగి ఉండాలన్నారు. ప్రశ్నించిన నాడే మన హక్కులను మనం కాపాడుకోగలమన్నారు. వినియోగదారుల చట్టానికి సంబంధించి పలు సూచనలు చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి గుంట సూర్య ప్రకాష్ మాట్లాడుతూ వినియోగదారుడు ఎక్కడా హక్కులు కోల్పోకూడదన్నారు. స్థిరమైన జీవనశైలికి కేవలం మార్పుపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఔషధ నియంత్రణ అధికారి చంద్రరావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శంకర్ విశ్వేశ్వరరావు, ఆహార భద్రత అధికారిణి కె.లక్ష్మి, గంజి ఆర్. ఎజ్రా, వేదమాత ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధి వాసు, వినియోగ దారుల ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, ప్రభుత్వ బాలుర కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుడుమూరు ఉన్నత పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌గైడ్ టీచర్ పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వస్తువులు కొనేటప్పుడు బిల్ తీసుకోవాలని, నాణ్యమైన వస్తువులను, కాలపరిమితి గల వస్తువులను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వినిమోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉంటే మోసపోవడం జరగదన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థి వినియోగదారుల క్లబ్ కార్యదర్శి జల్లు తనుశ్రీ, ఇతర సభ్యులు, ఉపాధ్యాయులు పి.తమ్మినాయుడు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చిన పెంటయ్య, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల సమస్యల లక్ష్యంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. శనివారం పట్టణంలో టిడిపి కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటిస్థలాల కోసం అధికంగా దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షులు నూక రాజు, పల్లి సురేష్, లంక జగన్నాథం నాయుడు, బి.వి రమణమూర్తి, రాంజీ తదితరులు పాల్గొన్నారు.



కాలువలోని మురుగును చూపిస్తున్న విద్యార్థులు

మురుగు తొలగించాలి

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్‌టిఆర్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కొంత కాలంగా కాలువ శుభ్రం చేయలేదు. దీంతో వ్యర్థాలు నిల్వ ఉండి కుళ్లి, భరించలేని దుర్వాసన వస్తుంది. తరగతి గదుల్లో విద్యార్థులు ఉండలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పూడికలు తొలిగించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



కవిటి : సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

సైకిల్ ర్యాలీకి స్వాగతం

కంచిలి : సిఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కోల్‌కతా ప్రారంభమైన సౌకిల్ ర్యాలీ బృందం శనివారం రాత్రి కంచిలి చేరుకుంది. ఈ బృందానికి స్థానిక మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ రహదారి కూడలి బలియాపుట్టుగ వద్దకు చేరుకున్న జాతీయ జెండాలు పట్టుకొని భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

కవిటి: సిఐఎస్‌ఎఫ్ ప్రారంభించి 56 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్ర మండలం కొజ్జిరియా, జాడుపూడి మీదుగా సాగింది.

సోంపేట : సైకిల్ యాత్రకు సోంపేటలో నాయకులు, స్థానికులు స్వాగతం పలికారు.

ముమ్మరంగా తనిఖీలు

పొందూరు: పొందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన శనివారం నార్కోటిక్ డాగ్ సహాయంతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. పొందూరు పట్టణంలోని మార్కెట్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌తో పాటు రాపాక జంక్షన్‌లోని దుకాణాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అంటూ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎఎస్ఐ రామచంద్రరావు ఉన్నారు.

ప్రశాంతంగా యాత్ర

సోంపేట : రట్టి గ్రామంలో వల్లభ నారాయణస్వామి యాత్ర ఈ నెల 9వ నుంచి శుక్రవారం రాత్రి 12 గంటలకు వరకు ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బారువ మెరైన్ సిఐ రమేష్ కుమార్ ఏర్పాటు చేశారు. ముందుగా సాగర తీరంలో సముద్ర స్నానాలు యాత్రికులకు వెళ్లారు. మెరైన పోలీసులు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి మైక్ ద్వారా అవగాహన కల్పించారు.

పాడైన ఆహారం.. పొంతన లేని సమాధానం

ప్రజాశక్తి- కవిటి

గ్రామీణ ప్రాంతాల్లో ఆహార తనిఖీలు నిర్వహించకపోవడంతో ఆహార విక్రయ కేంద్రాలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. నాసిరకం పదార్థాలు విక్రయించడమే కాకుండా వినియోగదారులపై తిరిగబడే పరిస్థితులూ ఏర్పడుతున్నాయి. అలాంటిదే కవిటిలో శనివారం ఓ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రంలోని మహాలక్ష్మి సినిమా హాల్ సమీపంలోని మహాలక్ష్మి స్పైసి హోటల్ నాసిరకం ఆహార పదార్థాలు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. భారత్ గ్యాస్ డీలర్ వెంకటరావు శనివారం మధ్యాహ్నం పార్సిల్ భోజనం ఇదే హోటల్ నుంచి తీసుకువెళ్లారు. భోజనం చేద్దామని పార్సిల్ ముట్టుకునేసరికి వాసన వచ్చింది. విప్పి చూస్తే అన్నంతో పాటు పప్పు కూడా పాడైంది ఇచ్చారు. ఇలాంటి ఆహారం ఎలా ఇస్తారని హోటల్ వారిని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతూ దబాయించే ప్రయత్నం చేశారు. గట్టిగా అడిగే సరికి తోక ముడిచారు.



పాడైన ఆహారం

తనిఖీలు శూన్యం

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆహార తనిఖీలు పూర్తిగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై ఆహార తనిఖీ విభాగాన్ని సంప్రదించినా తమవద్ద తగినంత సిబ్బంది లేదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఇదే ఆసరాగా తీసుకుని ఆహార విక్రయ కేంద్రాలు నాసిరకం పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తే ఇటువంటి నాసిరకం విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని మెట్టక్కివలసలో ఉన్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అందజేశారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అనుసరించాల్సిన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఆల్ ద బెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, అట్ట, పెన్సిళ్లు తదితర సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న రమేష్

కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్‌లు నాగళ్ల మురళీధర్ యాదవ్, దూసి సీతారాం, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, టిడిపి నాయకులు లంక నాగరాజు, షేక్ మాలిక్, కృష్ణకాంత్, బి.రాజేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సొసైటీ సభ్యులు

మొక్కలు నాటడం అందరి బాధ్యత


ప్రజాశక్తి- రణస్థలం

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా స్వీకరించి పుట్టినరోజున ఖచ్చితంగా మొక్కలు నాటి, సంరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం హరిత సొసైటీ సభ్యులు కొట్నాల శివకేష్, జ్యోతి దంపతుల కుమారుడు డేవిడ్ పుట్టినరోజు సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో మండలం దేరశాంలో ఉమాకల్యాణి భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉసిరి, పనస, స్వర్ణ గన్నేరు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ వలన ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతిఒక్కరూ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున మొక్కలను నాటడం, మొక్కలను బహుమతిగా అందజేయడం ఆనవాయితీగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటి నాయుడు, దాన్నాన వాసు, పి.నారాయణరావు, సంస్థ సభ్యులు ఆర్.లేఖ్యశ్రీ, మోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నాటుసారాను నిర్మూలించి భవిష్యత్ తరాలకు బాటవేద్దామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు అన్నారు. మండలంలోని నేలబొంతులో జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన నాటుసారా నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించి వ్యాపారాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై టోల్ ఫ్రీ నంబరు 14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్, ఫారెస్టు ఆఫీసర్ ఝాన్సీ, తహశీల్దార్ బడ్డే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎక్సైజ్ సిఐలు ఎస్.వి.రమణమూర్తి, ఆర్.మహేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న రామచంద్రరావు

సామాజిక తనిఖీలో వివాదం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ తనిఖీలో కొఠారి పంచాయతీలో అవకతవకలపై వివాదం చెలరేగింది. ఎపిడి కె.లోకేష్, డిఒఒ స్వరూపరాణి, ఎస్ఆర్‌పిలు తిరుపతిరావు, శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ నిర్వహించారుర. ఈ తనిఖీలో కొఠారి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డారని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సహదేవ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఇద్దరు. డయాలసిస్ రోగులు, ఇద్దరు పైరాలసిస్ రోగులు, ఇద్దరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నారని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనులు వద్దకు వెళ్లకుండా మస్టర్లు వేశారని అన్నారు. తనిఖీ బృందాలు సక్రమంగా పరిశీలించలేదన్నారు. మళ్లీ తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ రామారావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న సహదేవ్‌రెడ్డి



బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం గణేశ్వరరావు

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- మందస

మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గవ్వ భీమారావు ఏటా పదో తరగతి, ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న స్థానిక విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి. గోపాల కృష్ణ, బి.రమేష్, ఎస్.హారికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా శ్రీకాకుళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాదక దవ్యాల రహిత జిల్లాగా శ్రీకాకుళం మారాలని భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఉమ్మడి ఎపి అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత ఎక్కువమంది వ్యసానాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, సభ్యులు జెన్ని శ్రీనివాసరావు, సంతోష్, హేమంత్, ప్రసాద్, ఎండియు ఆపరేటర్స్ ప్రతినిధులు రామారావు, శివ, మాధవ్, అప్పారావు, సురేష్, శంకర్, కిరణ్, శ్రీను, జగన్, ఈశ్వర్, రాజా, వరుణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వితరణ చేస్తున్న మాజీ ఎంపిపి రామారావు

80 బెంచీలు వితరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 80 బెంచీలను మాజీ ఎంపిపి మాడుగుల రామారావు శనివారం వితరణగా అందించారు. ఇటీవల పాఠశాలను సందర్శించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు బెంచీలు లేకపోవడంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, పలాస వ్యవసాయశాఖ ఎడి ఎల్.వి.మధుబాబు, ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండ, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు, ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ చినబాబు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

టెక్కలి: ఈ నెల 2న నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ రెగ్యులర్ పరీక్షలు టెక్కలిలో ప్రశాంతంగా ముగిశాయి. టెక్కలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిఎస్‌జెఆర్, ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. అలాగే ఎపి సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన నిర్వహించిన ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలూ ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 3న ప్రారంభమైన ఈ పరీక్షలు టెక్కలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికోన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు.